సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



గ్యారంటీలపై అవగాహన

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేటలో సాంస్కృతిక కళాకారులు ఆరు గ్యారంటీలపై అవగాహనక కల్పించారు.



'ఛత్రపతి'కి నివాళి

గోదావరిఖని: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.6/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రణాళిక ప్రకారం అభివృద్ధి



సన్మానిస్తున్న మమతారెడ్డి తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళిక ప్రకారం రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ మమతారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎమ్మెల్యే విజయరమణారావు, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ హాజరయ్యారు. రూ.1,489.72 లక్షల అంచనా వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రెండు చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రారంభించారు. కాగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారి కౌన్సిల్‌కు సమావేశానికి హాజరైన విజయరమణారావును కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్ సన్మానించారు.

ప్లాస్టిక్ వినియోగించొద్దు



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న వెంకటేశ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సమ్మక్క – సారలమ్మ జాతరలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ వెంకటేశ్ కోరారు. నీరుకుల్ల సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో యూనిసెఫ్ సిబ్బంది ప్లాస్టిక్ వినియోగం ద్వారా కలిగే అనర్థాల గురించి భక్తులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. కరీంనగర్ యూనిసెఫ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎంపీడీవో దివ్యదర్శన్, ఎంపీవో ఫయాజ్‌అలీ, కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

కమాన్ ప్రారంభం



కమాన్ ప్రారంభిస్తున్న సత్యనారాయణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గర్రెపల్లిలోని సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లే దారిలో అల్లం రాజయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తిరుపతి నిర్మించిన కమాన్‌ను సోమవారం ప్రముఖులు ప్రారంభించారు. మాజీ సర్పంచులు సత్యనారాయణ, లక్ష్మణ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రమేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం, సింగిల్‌విండో వైస్ చైర్మన్ దీకొండ శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి క్లబ్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న సంపత్‌రావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లయన్స్‌క్లబ్ ఎలైట్‌కు ఉత్తమ సర్వీస్ ట్రోఫీ, ఉత్తమ క్లబ్ ప్రెసిడెంట్‌గా సంపత్‌రావుకు అవార్డులు ప్రదానం చేశారు. మంచిర్యాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ నారాయణరెడ్డి ఈ పురస్కారాలు అందజేశారు. క్లబ్ ద్వారా విశేష సేవలు అందించిన సభ్యులకు సంపత్‌రావు అభినందనలు తెలిపారు.

పెరిగిన పత్తి ధర

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి ధర స్వల్పంగా పెరిగింది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7132 నమోదైంది. కనిష్ఠంగా రూ.5,859, సగటు ధర రూ.6,888గా నమోదైందని మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. 235మంది రైతుల నుంచి 860 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

బాధ్యతగా హెల్మెట్ ధరించాలి



బైక్ ర్యాలీలో సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన

గోదావరిఖని: హెల్మెట్ ధరించడం బాధగా కాకుండా బాధ్యతగా స్వీకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ చేతన, ఏసీపీ రమేశ్ పాల్గొన్నారు.

'దళితబంధు' దళారులతో.. ఇక తాడోపేడో..!

- రెండోవిడత 'దళితబంధు'పై అనిశ్చితి
- దళారులకు డబ్బులిచ్చిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- సొమ్ము వాపస్ ఇవ్వాలని పైరవీకారులపై ఒత్తిడి
- ఠాణా మెట్లెక్కేందుకు బాధితుల యత్నాలు



"సాక్షి, పెద్దపల్లి: దళిత కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనింపజేయడం లక్ష్యంగా గత ప్రభుత్వం దళితబంధు పథకం అమలులోకి తీసుకొచ్చింది. తొలివిడతలో లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారు ఎంపిక చేసుకున్న యూనిట్లు పంపిణీ చేసింది. రెండో విడతలో నియోజకవర్గానికి 1,100మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసింది. కానీ, నిధుల లేమి, అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో యూనిట్ల పంపిణీలో జాప్యమైంది. ఈలోగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అంతటితో దళితబంధుకు బ్రేక్ పడింది."

జిల్లాలో 1,49,994మంది దళితులు ఉన్నారని అధికారుల అంచనా. తొలివిడతలో రామగుండానికి 100, పెద్దపల్లికి 100, మంథని నియోజకవర్గానికి 40, ధర్మారం మండలానికి 19.. మొత్తంగా జిల్లాలో 259 యూనిట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సిఫారసు మేరకే దళితబంధు లబ్ధిదారుల జాబితా రూపొందించారు. ఇందులో చాలామందికి మున్సిపల్ కౌనిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, జెడ్పీటీసల బంధువులు, కమీషన్లు ఇచ్చినవారికే మంజూరు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో రెండోవిడత జాబితాలోనైనా తమకు దళితబంధు అందుతుందని చాలామంది ఆశపడ్డారు. ఇది పైరవీకారులకు వరంగా మారింది. దీనికితోడు కొందరు కుల సంఘాల నాయకులు, గతంలో రుణాలు ఇప్పించిన అనుభవం ఉన్నవారు, రాజకీయ పలుకుబడి కలిగినవారు లిస్టులో పేరు ఎక్కిస్తామంటూ దళితుల నుంచి డబ్బులు వసూలు చేశారు. పథకంపై ప్రస్తుతం అనిశ్చితి నెలకొనడంతో బాధితులు దళారుల చుట్టూ తిరుగుతున్నారు. తాము ఇచ్చిన డబ్బులు వాపస్ చేయాలంటూ వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. అయితే, రేపు, మాపు అంటూ పైరవీకారులు తప్పించుకు తిరుగుతున్నారు. వారికి డబ్బులు ఇచ్చి మోసపోయిన వారు తాడోపేడో తేల్చుకునేందుకు ఠాణా మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్ వెళ్లేందుకు సిద్ధమవగా.. సెటిల్ చేస్తామని దళారులు వారిని బుజ్జగించినట్లు సమాచారం. మరికొందరు కేసుల నుంచి తప్పించుకునేందుకు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ టాపిక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటమి..

- జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు గత ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు.
- తొలివిడతలో లబ్ధిదారులను ఎంపిక చేసిన సమయంలో అప్పటి నేతల అనుచరులు, దళారులు కమీషన్లు తీసుకుని దళితబంధు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి.
- కొందరు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు లబ్ధిదారుల నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేశారని, రెండోవిడతలో అలా చేయవద్దని అప్పటి సీఎం కేసీఆర్ బహిరంగంగానే హెచ్చరించారు.
- రెండోవిడత యూనిట్లు పంపిణీ చేశాకే బీఆర్‌ఎస్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తుందనే ప్రచారంతో దళితబంధు అర్హుల జాబితాలో చేరేందుకు పోటీ ఏర్పడింది.
- ఇది పైరవీకారులకు అవకాశంగా మారింది. రెండోవిడతలోనూ దళారులు, అనుచరులు తమ పద్ధతి ఏమాత్రం మార్చుకోలేదు.
- లబ్ధిదారుల నుంచి యూనిట్‌పై రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేశారు.
- ఇలా దళారులు పెద్దఎత్తున కూడగట్టినట్లు సమాచారం.
- దళితులు ఆర్థికంగా బలపడేందుకు దళితబంధు పథకం అమలులోకి తీసుకొస్తే.. క్షేత్రస్థాయిలో ఆర్థికంగా నిలబడటం మాటేమో గానీ.. అదనంగా ఆర్థిక కష్టాలను కొనితెచ్చుకున్నామని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

రణరంగమైన బల్దియా



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో దూషణలకు దిగిన రెండు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

- ఎమ్మెల్యే సమక్షంలోనే కౌన్సిలర్ల దూషణలు
- పెద్దపల్లి బల్దియా వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- మోహరించిన పోలీసు బలగాలు
- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదులు



ఇరువర్గాలను సముదాయిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం సోమవారం రణరంగమైంది. బల్దియా సాధారణ బడ్జెట్ సమావేశంలో పాల్గొనడంతోపాటు కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే విజయరమణారావు కౌన్సిల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారి హాజరైన విజయరమణారావు చెంతనే నిల్చునేందుకు కొందరు కౌన్సిలర్లు ఉత్సాహం ప్రదర్శించారు. ఈక్రమంలో ఓ కౌన్సిలర్‌ను పక్కకు తప్పుకోవాలని మరో కౌన్సిలర్ కోరారు. అసహనానికి గురైన సదరు కౌన్సిలర్ వెంటనే దూషణల పర్వం అందుకున్నారు. జీర్ణించుకోలేక ఎదుటి కౌన్సిలర్.. తన వర్గీయులను బల్దియా కార్యాలయానికి రప్పించారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

సాఫీగానే బడ్జెట్ సమావేశం..

పెద్దపల్లి మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ మమతారెడి అధ్యక్షతన సాఫీగా జరిగింది. ఎమ్మెల్యే విజయరమణారావు, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ హాజరయ్యారు. బడ్జెట్ తీర్మానం ఆమోదించాక ఎమ్మెల్యే కార్యాలయం బయటకు వెళ్లేందుకు యత్నించారు. ఈక్రమంలో కౌన్సిలర్ నూగిల్ల మల్లయ్య వర్గీయులు ఒక్కసారిగా ఆఫీసులోకి చొచ్చుకు వచ్చి మరో కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్‌పై దాడికి దిగారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే విజయరమణారావు వారిని వారించి పోలీసుల సాయంతో బయటకు తీసుకొచ్చారు. ఇరువర్గాలను సముదాయించిన ఎమ్మెల్యే.. మరో కార్యక్రమంలో పాల్గొనేందుకు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మున్సిపల్‌లో ఉద్రిక్తత..

మున్సిపల్‌లో గొడవ జరుగుతోందని తెలుసుకున్న ఇద్దరు కౌన్సిలర్ల అనుయాయులు పెద్దసంఖ్యలో బల్దియా కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇరువర్గాలను అదుపు చేసేందుకు ఏసీపీ కృష్ణ, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేశ్‌తోపాటు పోలీసు సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేశ్ తెలిపారు.

నేడు స్క్రీనింగ్ టెస్ట్

పెద్దపల్లిరూరల్: జపాన్ ఆస్పత్రుల్లో పనిచేసేందుకు హోటల్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ, ఉద్యోగాల కల్పన కోసం అర్హత గల అభ్యర్థులకు ఈనెల 20న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. హైదరాబాద్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌లో రెండో టెస్ట్ నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాలకు టామ్‌కాం హెచ్‌ఆర్ మేనేజర్, 81252 51408 మొబైల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

భక్తులకు ఇబ్బంది రావొద్దు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గోదావరిఖని, గోలివాడ సమీప గోదావరి నదీ తీరాల్లో జరిగే జాతర భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్లపై సోమవారం తన కార్యాలయంలో సమీక్షించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, ఇందుకోసం ప్రత్యామ్నాయంగా జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది, 108 వాహనం, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, సీపీవో రవీందర్, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

అన్నిదానాల్లోకెల్లా అవయవదానం అత్యుత్తమమైనదని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో నేత్ర, శరీర, అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. మరణించిన తర్వాత శరీరాన్ని మట్టి, బూడిదపాలు చేయడం కన్నా ఇతరులకు ఉపయోగపడేలా దానాలు చేయాలని కోరారు. డాక్టర్ పరికిపండ్ల అశోక్ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి అవయవదానంపై ప్రమాణం చేయించారు. సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, అనిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పటిష్ట బందోబస్తు

- రామగుండం సీపీ శ్రీనివాస్



పుష్కరఘాట్ వద్ద సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: సమ్మక్క – సారలమ్మ దర్శనం కోసం జాతరకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం గోదావరిఖని గోదావరి నదీతీరంలోని సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. జాతర ఏర్పాట్లు తనిఖీ చేశాక విలేకరులతో మాట్లాడారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. డీసీపీ చేతన, ఏసీపీ రమేశ్, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మంచిపేరు తేవాలి

క్రమశిక్షణతో కూడిన పోలీస్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని మంచిపేరు సాధించాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ట్రెయినీ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికై తొమ్మిది నెలల శిక్షణకు వెళ్తున్న వారితో సీపీ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో ఏఆర్, సివిల్ విభాగాలకు చెందిన 381మంది కానిస్టేబుళ్లుగా ఎంపికకాగా వారందరికీ 9నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

సుల్తానాబాద్‌కు మంచిగుర్తింపు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ కేంద్రం మంజూరు కావడం ద్వారా సుల్తానాబాద్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు, ఖ్యాతి దక్కుతుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేశ్ అన్నారు. స్థానిక మార్కండేయ కాలనీలోని క్రీడా ప్రాంగణంలో ఖేలో ఇండియా ఖోఖో శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీసేందుకు కేంద్రప్రభుత్వం ఖేలో ఇండియా సెంటర్ మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించిన గేల్లు మధుకర్ యాదవ్, జెడ్పీటీసీ మినుపాల స్వరూప, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, ఎస్జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి అంతటి శంకర్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఛత్రపతి' బైక్‌ర్యాలీ

పెద్దపల్లిరూరల్: ఛత్రపతి యువసేన వ్యవస్థాపకుడు శివంగారి సతీశ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు రాజు, మల్లారెడ్డి, రాజేశ్, వంశీరాజ్, అభినయ్‌కుమార్ పాల్గొన్నారు.



మంథనిలో వందపడకల ఆస్పత్రి

- స్థల పరిశీలన చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అధికారులు సమాయత్తమవుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం స్థల పరిశీలన చేశారు. ప్రస్తుత సామాజిక వైద్యశాల ప్రాంగణంలోనే ఆస్పత్రి భవనం నిర్మించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం 30 పడకల నుంచి వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. మరోవైపు.. అదనపు భవనాల నిర్మాణానికి కూడా స్థల పరిశీలనకు ప్రతిపాదనలు తయారు చేస్తారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి తేవాలనే మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాకాంత్, మంథని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తమకు 9 నెలల వేతనం రావాలని సామాజిక వైద్యశాల సిబ్బంది, 16నెలలకు సంబంధించిన జీతాలు విడుదల చేయాలని స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రం సిబ్బంది కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. సిబ్బంది శ్రావణ్, చందు, శ్రీకాంత్, రమాదేవి, లక్ష్మి, ప్రమీల, స్వప్న, వాణి పాల్గొన్నారు.

ఇటుక బట్టీలు తనిఖీ చేయాలి

ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కార్మిక శాఖ అధికారి గైర్హాజరు కావడం, కిందిస్థాయి ఉద్యోగి రావడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సమాచారం లేకుండా గైర్హాజరైతే ఎలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్‌లోని ఇటుక బట్టీలు తనిఖీ చేయాలని, కార్మికులకు కల్పించిన వసతులు, జీవన విధానం తదితర అంశాలపై శుక్రవారంలోగా తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. పట్టణంలో బస్తీ దవాఖానాల ఏర్పాటుకు అనువైన భవనాలు గుర్తించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచి, సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టు పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుపర్చాలన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సారెస్పీ నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని చెప్పారు. ఆర్డీవో హనుమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. కనికరం చూపండి

- సమస్యలు ఏకరవు పెట్టుకున్న బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: తమ సమస్యలు పరిష్కరించాలని బాధితులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మొరపెట్టుకున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి కలెక్టర్ హాజరై స్వయంగా అర్జీలు స్వీకరించారు. తమ చెంతకే కలెక్టర్ వస్తున్నారనే సమాచారంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గోడువెళ్లబోసుకున్నారు.

- రామగిరి మండలం వెల్లలపహాడ్ శివారులోని సర్వే నంబరు 10/ఏలో తన అత్త అంజలి పేరిట ఉన్న భూమిని కుమారుడు రఘు పేరిట మార్చాలని ఆర్నెల్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని మంథని శ్రీదేవి కలెక్టర్‌కు విన్నవించారు.
- తన భార్య ప్రసవ సమయంలో మంథనిలోని మాతాశిశు ఆస్పత్రిలోని మత్తు డాక్టర్ మోహన్‌రావు తన వద్ద డబ్బులు వసూలు చేశారని మంథనికి చెందిన బండారి సమయ్య ఫిర్యాదు చేశాడు. ఆయనపై విచారణ చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్.. విచారణ నివేదిక అందజేయాలని ఆస్పత్రుల ఇన్‌చార్జిని ఆదేశించారు.
- మంథని మున్సిపాలిటీకి చెందిన సదానందం మీ సేవా కేంద్రం మంజూరు చేయాలని కోరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారు.
- అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పంటలు నష్టపోతున్న తమకు పరిహారం ఇప్పించాలని మంథని శివారులోని పలువురు రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అలాగే జాతీయ రహదారి కింద భూములు కోల్పోతున్న తమకు సరైన పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.
- ధర్మారం మండలం కటికనపల్లి శివారులో నాలా కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఎలిగేడు మండలం ముప్పిరితోటకు చెందిన మౌలానా ఆవేదన వ్యక్తం చేశాడు.
- తనకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉందని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉపాధి కల్పించాలని ధర్మారం మండలం ఖిలావనపర్తికి చెందిన దివ్యాంగుడు జక్కుల సంతోష్ కలెక్టర్‌కు విన్నవించాడు.

ప్యాకేజీ ఇప్పించండి



ఆర్జీ–3లో సింగరేణి చేపట్టిన భూసేకరణలో మా ఇల్లు కోల్పోయినం. ఆర్ ఆర్ అండ్ ప్యాకేజీ జాబితాలో మా పేరు లేదు. చాలాఏళ్లుగా తిరుగుతున్న. ప్యాకేజీ ఇప్పించి ఆదుకోండి

– వేయిగండ్ల రజిత, రచ్చపల్లి, మంథని

సాయం చేయండి



చిన్నతనంలోనే నాన్నను కోల్పోయిన. దివ్యాంగుడిని. పేద కుటుంబం. అయినా, డిగ్రీ వరకు చదువుకున్న. ఉద్యోగం లేదు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉంది. ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోండి.

– తోకల మహేశ్‌కుమార్, మంథని

ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి ద్వారా అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌కు విన్నవించారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్లు ఆదేశించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల్లో 39 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. పోలీసుశాఖకు చెందిన 10, కమిషనరేట్ పరిధిలో 4, ఎస్సీ సంక్షేమశాఖలో 3, టెక్స్‌టైల్స్‌లో 5, నీటిపారుదల శాఖలో 4, గ్రామీణాభివృద్ధిశాఖలో 3, మిగతా శాఖల్లో మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



కరీంనగర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో రామడుగు మండలం రుద్రారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జెండర్ డిస్క్రిమినేషన్ అనే డ్రామా అంశంలో పాల్గొని సత్తాచాటిన గోనే వైష్ణవి (9వ తరగతి), పల్లి ప్రణయ, పింగిలి అనన్య, వెలుమల సహస్ర, కొక్కుల శివమణి (8వ తరగతి)లను గైడ్ టీచర్ శ్రావణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ పి.మొండయ్య, వినయధర్ రాజు, సీహెచ్ ప్రద్యుమ్నకుమార్, జి.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ రంగనాథశర్మ అభినందించారు.

కల్వర్టు వద్ద లారీ బోల్తా



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి గోధుమల లోడ్‌తో వరంగల్ వైపు వెళ్తున్న లారీ మేడిపల్లి – వెంకట్రావుపేట మధ్య కల్వర్టు వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏవరికీ ఏమీ కాలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో రెండుప్రమాదాలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రాయికల్:రాయికల్ మండలం రామాజీపేటలో అక్రమంగా నిలువ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ య్యాన్ని పట్టుకున్నట్లు జగిత్యాల, మల్యాల సివిల్ సప్లై డీటీలు వరప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రామాజీపేటలో బియ్యం నిలువ చేశారనే పక్కా సమాచారంతో దాడులు చేశామని, ఇందులో 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని వారు తెలిపారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం



చంద్రారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి చంద్రారెడ్డి(70) సోమవారం ఉదయం అదృశ్యమయ్యాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాలు.. చంద్రారెడ్డి ఏడాదిగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి భార్య లక్ష్మి, కుమారులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కూతురు వెంకటవ్వ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రైతే 'మార్కెట్'కు రాజు

- మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా వారే నియామకం
- మార్గదర్శకాలు వెలువరించిన ప్రభుత్వం
- పదవీకాలం మూడేళ్లు
- జిల్లాలో 7 మార్కెట్లు



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఇక రైతులే పాలకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను వెలువరించగా.. వాటి ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఏడాది ఉండే పాలకవర్గ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరేసి నెలలు రెండుసార్లు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు వచ్చే పాలకవర్గాల పదవీ కాలం మూడేళ్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు పదవుల కోసం ఇప్పటికే పైరవీలు మొదలుపెట్టారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ మార్కెట్లుండగా రిజర్వేషన్ విధానంలో పాలకవర్గాలను ప్రకటించనున్నారు.

18 మంది సభ్యులతో కమిటీ

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ల చట్టం-1966 సెక్షన్-5(1), ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతీ మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది. దీని పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక(మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి. అలాగే కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నలుగురు ఉండనున్నారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, జిల్లా వ్యవసాయ/ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యులుగా ఉండనున్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్ నియామకం ఇలా..

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

మార్కెట్లఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

మార్కెట్‌ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్ విధానం కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడ్ ఇస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే దాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే గ్రేడ్-1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్-2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే గ్రేడ్-3గా పరిగణిస్తూ ఆయా గ్రేడ్ స్థాయిని బట్టి అధికారులను, రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారిని నియమిస్తారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట మార్కెట్లు సెలక్షన్ గ్రేడ్ కాగా, చొప్పదండి స్పెషల్ గ్రేడ్, హుజూరాబాద్ గ్రేడ్-1, గంగాధర గ్రేడ్-3, మానకొండూరు, గోపాల్‌రావుపేట వేటి పరిధిలోకీ రావు.

రిజర్వేషన్లతో చైర్మన్ పదవులు

రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్ పదవులు వరించనున్నాయి. ఆయా మార్కెట్లకు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్లను నియమించనున్నారు. కరీంనగర్ మార్కెట్ పాలకవర్గానికి బీసీ, జమ్మికుంట-ఎస్సీ మహిళా, మానకొండూరు-ఎస్టీ, గంగాధర-జనరల్ మహిళా, గోపాల్‌రావుపేట-జనరల్ మహిళా, చొప్పదండి-ఎస్సీ, హుజూరాబాద్- జనరల్ మహిళకు కేటాయించారు.

ఆరిపోయిన 'దియా'

- లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని దుర్మరణం
- బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో ఘటన



దియాపటేల్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: లారీ ఢీకొని ఓ విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన వాసాని జగదీశ్ కొన్నేళ్ల క్రితం భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగా కట్టెకోత మెషీన్ పని చేస్తున్నాడు. ఆయన పెద్ద కూతురు దియాపటేల్(19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఎలక్ట్రికల్ స్కూటీపై కాలేజీకి వెళ్తోంది. బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో గోదావరిఖని నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 టైర్ల లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దియాపటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంటకే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఎంసీహెచ్‌లో శిశువు అపహరణ నిర్లక్ష్యం వల్లే జరిగిందని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగంధర్, అధ్యక్షుడు బోనగిరి మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. గతంలోనూ శిశువుల మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదన్నారు. తాజా సంఘటనకు డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు, జీఎస్ఎం, ఏఎస్ఎం, వైద్యులు, అధికారులను బాధ్యులను చేస్తూ వారిని సస్పెండ్ చేయాలని విన్నవించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఔట్‌పోస్టు లేదని, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీపైనే ఆధారపడటంతో భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చెంచల మురళి, నాయకులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ ప్రచారాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న భీంరెడ్డి, నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బతీసే కుట్రలో భాగంగా బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వచ్చిందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు దీన్ని నమ్మవద్దని నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.భీంరెడ్డి, బ్రాయిలర్ రైతుల సంక్షేమ సంఘం సభ్యుడు డి.జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమ్మక్క జాతర నేపథ్యంలో చికెన్, కోడిగుడ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దళారులు లాభాలు పొందేందుకు వదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రతినిధులు ఎం.ఖదీర్, పాదం రాజు, సంకిటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నర్సింహులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్నిక



అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి, అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారుడు కంకటి అనూప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనూప్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, కరీం, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, జూడో సంఘం రాష్ట్ర సభ్యులు మహేందర్, సురేందర్ సింగ్, వికాస్, గౌతమ్, సందీప్ తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ వరంగల్, రంగారెడ్డి



పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన వరంగల్ జిల్లా జట్టు



మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టు





తృతీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషుల, మహిళల జట్లు

- ద్వితీయస్థానాల్లో హైదరాబాద్, వరంగల్
- ఉమ్మడి కరీంనగర్ జట్లకు తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పురుషుల చాంపియన్‌గా వరంగల్ జట్టు, మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఇటీవల వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపిక చేశామన్నారు. పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, కరీంనగర్ జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రభాకర్, వెంకటేశ్, నర్సయ్య తదితరులున్నారు.

మహిమగల పుణ్యక్షేత్రం ఎములాడ



సుమన్‌ను సత్కరిస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అత్యంత మహిమగల పుణ్యక్షేత్రమని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడారు. రాజన్న క్షేత్రం అత్యంత మహిమ కలిగిన దేవుడని, అందుకే నిత్యం వేలాది మంది భక్తులు ఆయన దర్శనం కోసం వస్తున్నారని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను రాజన్నకు మొక్కుకున్నానని వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులు సుమన్‌ను సత్కరించారు.

ఏపీఏ మైన్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న గని మేనేజర్ తిరుపతి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ అడ్రియాల ప్రాజెక్టు ఏరియా గనికి 2023–24 సంవత్సరానికి గాను 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్ విభాగంలో జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, అడిషనల్ మేనేజర్ శ్రీకాంత్ 'డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్'లో సమర్థత, భద్రతను పెంచడం, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్, ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టంలతో కూడిన కేస్ స్టడీని సమర్పించారు. దాని ఆధారంగా 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్' 2023–2024 కేటగిరీలో అవార్డు దక్కింది. భువనేశ్వర్‌లో జరిగిన సదస్సులో గని మేనేజర్ ములుకుంట్ల తిరుపతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఫికప్ వాహనాన్ని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి శ్రీనివాస్‌రావు వివరాల ప్రకారం.. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన గాంతుల సత్తయ్య తన ఫికప్ వాహనంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నారాయణపూర్ మానేరువాగు నుంచి ఇసుకను కామారెడ్డి జిల్లా కేంద్రంలో అమ్మడానికి తరలిస్తుండగా గొల్లపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సీటు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

బస్సుల కొరత.. ఇబ్బందుల తీవ్రత



ఫుట్‌బోర్డు ప్రయాణం



కామారెడ్డి బస్సులో కిక్కిరిసిన జనం

సమయానికి బస్సులు రాక సోమవారం సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేడారం జాతరకు సిరిసిల్ల డిపో నుంచి 32 బస్సులు పంపించారు. డిపోలో మొత్తం 61 బస్సులు ఉండగా అందులో సగం జాతరకు పంపడంతో బస్సుల కొరత ఏర్పడి, సమయానికి రాక ప్రయాణికులు చాలాసేపు నిరీక్షించారు. తీరా బస్సులు బస్టాండ్‌కు రావడంతో సీట్లకోసం ఎగబడ్డారు. నిల్చోడానికి చోటు లేక చివరికి ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేశారు. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో జనంతో బస్టాండ్ కిక్కిరిసింది. చాలా సేపు బస్సులకోసం వేచి చూసి గత్యంతరం లేక సమయానికి ఇంటికి చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయించారు. ఇదే అదనుగా భావించిన ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేశారు. ఇదేం గోసరో నాయనా అంటూ జనం ప్రయాణం సాగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

యువతి అదృశ్యం

కరీంనగర్‌క్రైం: ఎల్లారెడ్డిపేట మండలం అక్కన్నపేటకు చెందిన ఎ.సుజాత (22) యువతి ఈనెల 17న కరీంనగర్‌లో అదృశ్యమైనట్లు సోమవారం ఆమె కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాత ఈనెల 17న కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వచ్చింది. ఆదే రోజు ఆమె సర్టిఫికెట్ల పనిమీద హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పడంతో వారి సమీప బంధువు ఒకరు బైక్‌పై బస్టాండ్‌లో దింపాడు. అప్పటి నుంచి ఆమె ఫోన్ పనిచేయకపోవడంతో ఆచూకీ కోసం హైదరాబాద్‌లోని స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తాత వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌కు చెందిన వృద్ధుడు బోయిని మల్లయ్య (65) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాలు... ఓగులాపూర్‌కు చెందిన మల్లయ్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చాలా ఆసుపత్రిల్లో చికిత్స చేయించిన నయం కాలేదు. దీంతో మానసికంగా వేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఇలవేల్పుకు నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. క్యూలైన్లు ఎక్కడికక్కడ నిండిపోయాయి. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





